జోరందుకున్న పంటల సాగు పనులు

# యాసంగి సాగులో.. అన్నదాత బిజీబిజీ..



- ఈ సీజన్‌లో 99,306 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా
- ఇప్పటివరకు 6,943 ఎకరాల్లో సాగు
- నీటి లభ్యత ఉన్న చోట పత్తి సాగుపై మొగ్గు చూపుతున్న జిల్లా రైతాంగం
- సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచిన అధికారులు



సంకేపల్లి గ్రామంలో వేరుశనగ పంట సాగు

రంగారెడ్డి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో యాసంగి పంటల సాగు జోరందుకుంది. ఈసారి 99,306 ఎకరాల్లో పంటలు సాగవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తున్నది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 6,943 ఎకరాల్లో పంటల సాగు పూర్తయింది. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో అధిక శాతం రైతులు పత్తి సాగువైపే మొగ్గు చూపుతున్నారు. నీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సాగు చేసుకుంటుండగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలను సాగు చేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ ముందస్తుగా అందుబాటులో ఉంచింది.

### సాగు పనుల్లో బిజీబిజీ

గత నెలారంభం నుంచి యాసంగి సాగు ప్రారంభమైంది. నీటిపారుదల సదుపాయాలు పెరగడంతో యాసంగిలోనూ పెద్దఎత్తున రైతులు పంటలను సాగు చేసేందుకు ఉపక్రమిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో సాగు పనుల్లో మందకొడి నెలకొనగా.. అనంతరం మళ్లీ పంటల సాగు వేగవంతమైంది. కొన్ని చోట్ల ఇప్పటికే పంటల సాగు మొదలవ్వగా.. మరికొన్ని చోట్ల దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లాలో ఇంకా వరి పంటల సాగు మొదలుకాలేదు. వరిసాగు కోసం నారుమడులు పోసుకున్నారు. వచ్చే వారం, పది రోజుల్లో వరినాట్లు పెద్దఎత్తున సాగనున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వరి సాగయ్యే అవకాశాలున్నాయి. కొంతమంది రైతులు వానకాలం ధాన్యం అమ్మకాలు ముగిసిన తర్వాత నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అక్కడక్కడ ఇప్పటికే మొలకెత్తిన పంటల్లో కలుపు సైతం తీస్తున్నారు. విత్తనం మొలకెత్తని చోట రైతులు మరోసారి విత్తనాలు నాటుకుంటున్నారు.



తంగడపల్లిలో తెల్లకుసుమ పంట సాగు

### యాసంగిలో సాగయ్యే ప్రధాన పంటల వివరాలు

| పంటలు | సాగు అంచనా (ఎకరాల్లో) | సాగైనది (ఎకరాల్లో) |
|---|---|---|
| వరి | 52,470 | – |
| మొక్కజొన్న | 6,205 | 232 |
| శనగ | 6,497 | 855 |
| వేరుశనగ | 4,509 | 4,760 |
| పొద్దు తిరుగుడు | 2,731 | 815 |
| ఇతర పంటలు | 2,584 | 281 |
| **మొత్తం** | **99,306** | **6,943** |

### వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికలు

జిల్లాలో యాసంగికి అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయ శాఖ ముందస్తుగా ప్రణాళికలు రూపొందించింది. అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందజేసేందుకు సిద్ధం చేసి ఉంచింది. విత్తనాలు, ఎరువులకు ఎక్కడా కొరత లేదని అధికారులు పేర్కొంటున్నారు. యాసంగి సీజన్‌కు యూరియా 17,741 టన్నులు, డీఏపీ 6వేల టన్నులు, ఎస్ఎస్పీ 500 టన్నులు, ఎంఓపీ 1200 టన్నులు, కాంప్లెక్స్ 12,500 టన్నులు అవసరం ఉండగా.. ఇప్పటికే 5,588 టన్నుల మేర ఎరువులను అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 11,938 టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు.



మొయినాబాద్‌లోని గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన 'గురుకుల్ ఒలింపిక్స్' ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో 24 పాఠశాలల నుంచి 7వేల మందికి పైగా విద్యార్థులు పోటీపడుతున్నారు.

# అండగా ఉంటాం

- చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
- బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం

వికారాబాద్, డిసెంబర్ 6 : గెలిచినా ఓడినా చివరి రక్తపు బొట్టు వరకు వికారాబాద్ ప్రజల కోసమే చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, మోమిన్ పేట్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుందాం.. భవిష్యత్తులో మీ వెంట నేనుంటా.. నా వెనక మీరుండి కలిసి కట్టుగా పనిచేద్దాం. దేనికైనా సిద్ధం. నా కోసం పనిచేసిన కార్యకర్తలను కాపాడుకుంటా'మని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజా తీర్పును గౌరవిస్తూ అనునిత్యం పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై పోరాడుదామని పిలుపునిచ్చారు. మన నాయకులు కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పదేండ్లపాటు పాలించే అవకాశం కల్పించిన సమయంలో ఎలా అయితే పని చేసామో.. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రతి దశలో ప్రజాల పక్షాన నిలబడాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సురేశ్, కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

# నేడే సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

సిటీబ్యూరో, (నమస్తే తెలంగాణ) / సుల్తాన్‌బజార్, డిసెంబర్ 6: తెలంగాణ రాష్ట్రానికి మూడో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గురువారం ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. బుధవారం ఎల్‌బీ స్టేడియంలో సీఎస్ శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్, జలమండలి ఎండీ దానకిశోర్, నగర పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్యా, డీఎంఈ రమేశ్‌రెడ్డితో పాటు ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎటువంటి ఆటంకాలు రాకుండా చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్, యువజన నాయకులు అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు ఇతర నాయకులు ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, యాదగిరిరావు, ఉపేందర్‌రెడ్డి, ఎంటమాలజీ చీఫ్ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, సీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.



ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎస్ శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు

### ఎల్బీ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎల్బీ స్టేడియం పరిసరాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా పంజాగుట్ట, వీవీ విగ్రహం, మోనప్ప జంక్షన్, నిరంకారి, సైఫాబాద్, లక్డీకపూల్, రవీంద్రభారతి, ట్రాఫిక్ కంట్రోల్ రూం, బషీర్‌బాగ్, అబిడ్స్ సర్కిల్, నాంపల్లి, హిమాయత్‌నగర్, ఎంజేమార్కెట్, హైదర్‌గూడ జంక్షన్లలో రద్దీ ఉంటుందని, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు సూచించారు.

31వ జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు..

# సిస్టర్ నివేదిత స్కూల్ విద్యార్థి ఎంపిక

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని సిస్టర్ నివేదిత హైస్కూల్‌కు చెందిన శివమ్ బెనర్జీ అనే విద్యార్థి 31వ జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాలల సైన్స్ కాంగ్రెస్‌లో శివమ్ బెనర్జీతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విజయనగర్‌కాలనీ విద్యార్థి వియూరి లిఖిత, భారతీయ విద్యా భవన్ విద్యార్థిని రాగవి, జవహర్ వీఎన్ ఇంగ్లిష్ హైస్కూల్ విద్యార్థి జి.హృశిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిస్టర్ నివేదిత స్కూల్‌కు చెందిన విద్యార్థి శివమ్ ఫాస్టర్ హెల్త్ న్యూట్రిషన్ వెల్‌బీయింగ్ ఉప అంశంలో తన ప్రాజెక్టు సీరిస్‌ను ప్రదర్శించడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శివమ్‌ను జిల్లా విద్యాధికారిణి ఆర్.రోహిణి, జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ తదితరులు అభినందించారు.



శివమ్‌ను అభినందిస్తున్న డీఈవో రోహిణి తదితరులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

# భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

### గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

కవాడిగూడ, డిసెంబర్ 6: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని అన్నారు.